# అనుమానం

వర్షం రాత్రి!

సరిగ్గా గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

నవల సీరియస్‌గా చదువుతున్నాను.

కొంచెం శృంగారదాయకంగా వుందా నవల.

కాసేపటికి—

ఎవరో తలుపు మీద దబదబ బాదుతున్నారు.

నిద్రరాకనే నవల చదువుతున్నాను. చల్లని గాలి వీచి సన్నని నీటి తుంపర్లు కిటికీ గుండా పడ్తున్నాయ్ . ఒళ్ళంతా మత్తుగా వుంది. బద్ధకంగా లేచి తలుపు తీసాను.

అతనిని చూసి ఆశ్చర్యపోయాను.

"ఇంతరాత్రి వేళ మీరు" అనేంతలో అందుకున్నారతను.

"పన్నెండున్నరకు ట్రైన్ అందుకుందామని అరగంట క్రితమే బయలుదేరాను" బ్రీఫ్ కేస్ కిందపెట్టాడతను.

"వాడు లేడా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"లేరు."

"ఏం?"

"వాళ్ళచెల్లెలుకు సీరియస్ అని టెలిగ్రాం వచ్చింది. ఉరుకులు పరుగులు మీద వెళ్ళారు" టవల్ ఇచ్చాను.

తల తుడుచుకున్నాడు.

వర్షం జోరుగా పడుతోంది.

బలిష్టంగా వున్న తనే వణుకుతున్నారు.

నాకూ పెదవుల వణకు పట్టుకుంది.

ఫ్లాస్క్‌లో కాఫీ ఇచ్చాను.

ఇద్దరం 'కాఫీ'సిప్ వేస్తున్నాం.

నేను అతనివైపు పరీక్షగా చూసాను.

దబ్బపండులాంటి శరీరఛాయ. కోటేరు లాంటి నాసిక. మెరుకయిన కళ్ళు... చాలా అందంగా ఉన్నాడతను.

నా భర్త గుర్తుకు వచ్చాడు. సన్నగా నల్లగా పిల్లి ముఖం చక్కి దవడలు, అతనికీ ఇతనికీ ఎంత తేడా?

"ఈవర్షం ఈ రాత్రికి తగ్గినట్టులేదు" అన్నాడు విసుగ్గా

మత్తు వదలనట్టుగా 'అవును' అన్నాను.

"మీది మరీ అంత ముఖ్యమైన ప్రయాణమా?"

"అందుకేగా ఇంత రాత్రిపుడు బయలుదేరాను"

"సరే లెండి ప్రకృతి మీ ప్రయాణాన్ని ఆటంకపర్చింది. మీరు పడుకుంటానంటే మంచం వేస్తాను".

"వర్షం తగ్గితే స్టేషన్‌కి వెళతాను".

ఇంకా ఏం స్టేషన్? ట్రైన్ ఈపాటికి వెళ్ళిపోయుంటుంది."

"అయితే వర్షం తగ్గాక ఇంటికిపోతాను."

"ఎందుకు? ఈ రాత్రికి ఇక్కడే పడుకోండి. ఇదేం పరాయివాళ్ళ ఇల్లుకాదు... ఉదయం గోదావరి కెళ్ళమ్మ".

అతని అనుమతి పూర్తిగా తీసుకోకుండానే మంచం వేసాను.

మౌనంగానే మంచం మీదికి చేరారతను లుంగీ కట్టుకొని, ప్రయాణం వాయిదా వేసుకుని".

"పడుకోండి... గుడ్ నైట్'" లైట్ ఆఫ్ వేసి, నాగదిలోకి నవల పట్టుకుని వెళ్ళాను.

ఒంటిగంట... రెండు... మూడు... గడియారం తిరుగుతూనే వుంది.

లైట్ ఆఫ్‌వేసి, అతని మంచం ముందు కూర్చున్నాను.

తర్వాత చొరవగా అతని పక్కకు చేరాను.

గట్టిగా కౌగిలించుకున్నాను.

అంతే!

అతనికి తెలివి వచ్చింది.

గదినిండా చిక్కటి చీకటి.

"ఏమండీ... ఏమండీ లెండి. నేను... నేను సురేష్‌ని" అన్నాడతను.

"నాకు తెలుసు. లేవకండి. వర్షం రాత్రి... నాకు మీ వెచ్చని కౌగిలి కావాలి" అతన్ని మరింత అల్లుకోబోయాను.

కానీ...

అతను చటుక్కున లేచిపోయారు.

లైట్ వేసారు.

అర్ధనగ్నంగా వున్న నన్ను అసహ్యంగా చూసారు.

"లైట్ ఆఫ్ వేసేయండి... నాకు సిగ్గేస్తోంది" అన్నాను.

"ఏమండీ సునీతగారూ మీకు మతిపోయిందా?" కోపంగా అతను.

"కాదు. మిమ్మల్ని చూసాక పూర్తిగా పిచ్చి పట్టుకుంది."

"నేను మిమ్మల్ని ఆదృష్టితో చూళ్ళేను".

"నేనూ ఇన్నాళ్ళూ ఆ దృష్టితో చూడలేదు."

"మరి?"

"మనిషికి మనిషి... వర్షం రాత్రి! అంతే! మరింకేం అనకండి."

"నా స్నేహితుడికి ద్రోహం చేయమంటారా?"

"ఇందులో ద్రోహం ఏముంది? నేనే మిమ్మల్ని కోరినపుడు."

"కోరికలు గుఱ్ఱాల వంటివి. వాటిని అదుపులో పెట్టుకున్నవాళ్ళే నిజమయిన మనుషులు. వారికే విలువ నా దృష్టిలో."

"నా కోరిక తీర్చక పోతే మీ విలువ?"

"తగ్గుతుంది మీ దృష్టిలో— అంతేగా"

"సురేష్ గారూ నన్ను విసికించకండి. మీరింత పిరికివారు అనుకోలేదు".

"పిరికితనం కాదు... నాది మంచితనం."

మా ఇద్దరి మధ్య 'మౌనం' కొద్ది క్షణాలు.

నేను లేచి కుర్చీలో కూర్చున్నాను.

"సురేష్‌గారూ భర్త భార్యను ఎపుడూ అనుమానిస్తుంటే ఎలా వుంటుంది?"

"అసహ్యంగా వుంటుంది".

"మీరూ మా ఆయన క్లోజ్ ఫ్రెండ్స్ కదా".

"అవును"

"మీరు మీ ఇంట్లో లేనపుడు మా ఆయన మీ ఇంటికెళితే అతనిపై ఎలాంటి అభిప్రాయమైనా, అనుమానమైనా కలిగిందా?"

"లేదు"

"కానీ, మీ మీద మీ స్నేహితుడికి ఎంత అనుమానం ఉందో...! ఆ అనుమానాన్ని మీ ముందు వ్యక్తం చేయలేక మింగలేక, కక్కలేక అన్న స్థితిలో ఉన్నారాయన. ఆయనకి నా మీద నమ్మకం పోయిందట..."

"వాడి స్వభావమే అంత! అలాని ఇలానే ప్రవర్తిస్తారా?"

భర్త భార్యనుగాని, భార్య భర్తను గాని ఎప్పుడూ కాపలా కాసుకోగలరా? 'శీలం' అనేది నిజాయతీకి సంబంధించిన విషయం. ఒకరు ఏదో అన్నారని మీ నిజాయతీని కోల్పోతారా? మీ భర్తలానే నా భార్య నన్ను అనుమానిస్తుంది. అంత మాత్రాన ఆమె వీక్‌నెస్‌ని ఆధారంగా చేసుకొని నేను ఆమెకు ద్రోహం చేయగలనా? ఒక మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా నేను నా భార్యకు గాని, నా స్నేహితులకుగాని ఎవరికీ ద్రోహం చేయలేనండీ! క్షమించండి. ఇంటికి పోతాను" అతను బట్టలు వేసుకొని చరచరా వెళ్ళిపోయాడు.

చేష్టలుడిగి ఉండిపోయాను.

ఎప్పుడోతెల్లారు ఝామున చిన్న కునుకు పట్టింది.

★★★★★★

సిటీ దిగి ఇంటికి వచ్చే సరికి మావారు విసుగ్గా నా వైపు చూసారు.

"ఎంత సేపయింది వచ్చి?"

"గంటన్నర అవుతోంది! ఎక్కడికి షికార్లు కొట్టొస్తున్నావ్?"

"ఆ ఫరవాలేదు. నేను లేకపోతే నీకు స్వేచ్ఛ బాగా వచ్చిందన్న మాట. ఎక్కడికి వెళ్ళావ్?"

నేను సమాధానం ఇవ్వలేదు.

"మాట్లాడవేం?"

"స్నానం చేసి రండి. కాఫీ టిఫిన్ రెడీ చేస్తాను" గిల్టీ ఫీల్ అవుతూ అన్నాను.

"భయపడి పోతున్నట్టు ఎందుకా నటన? నేనేం రాక్షసుడ్నా?"

"కాదు — మీరు దైవసమానులు"

"అదెప్పటి నుంచీ"

"ఈతాళి కట్టినప్పటి నుంచి"

అదోలా చూస్తూ స్నానానికెళ్ళారాయన.

కాఫీ టిఫిన్ తయారు చేసాను.

అద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటున్నారతను.

సురేష్ మాటలు గుర్తొచ్చాయ్.

'అవును. ఒక్కొక్కరి స్వభావం ఒక్కోలా వుంటుంది. అందుకని మన నిజాయతీని కోల్పోతామా?

నా మనసు తేలికపడింది.

ఆయనకు వేడివేడి ఉప్మా ప్రేమగా వడ్డించాను.

"ఏమిటి? ఇవాళింత ప్రేమ ఒలకబోస్తున్నావ్?" అన్నారతను. ప్రేమ అన్న పదాన్ని వొక్కి పలుకుతూ.

మాట్లాడకుండానే కాఫీ అందించాను.

పురిజాల సుధాకర్

